

తుక్కుగూడ మున్సిపాలిటీ అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

# పెండింగ్ పనులను పూర్తి చేయండి

- వర్షాకాలంలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోండి
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- తుక్కుగూడ మున్సిపాలిటీ అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం

బడంగ్‌పేట, జూన్ 11 : తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే చాంబర్‌లో మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డివిజన్ల వారీగా ఉన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయని అడిగారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గతంలో శంకుస్థాపన చేసిన పనులను త్వరగా పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌పై చర్చించారు. అధికారులు వర్షాకాలంలో అందుబాటులో ఉండాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డుల వారీగా ఉన్న సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ వెంకట్రామ్, డీఈ యాదయ్య, ఏఈ భార్గవరెడ్డి, కౌన్సిలర్ సుమన్, రవీనాయక్, చప్పిడి లావణ్యా రాజు తదితరులు పాల్గొన్నారు.

# జలమండలిలో బదిలీలు షురూ..

### వారం రోజుల వ్యవధిలో ట్రాన్స్‌ఫర్.. ప్రక్రియను పూర్తి చేసే దిశగా కసరత్తు



సిటీబ్యూరో, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : జలమండలిలో సమూల ప్రక్షాళనపై ఎండీ సుదర్శన్ రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు జీపీఈ (జనరల్ పర్పస్ ఎంప్లాయీ) మొదలుకొని డైరెక్టర్ల వరకు బదిలీలు జరిపేందుకు కసరత్తు ప్రారంభించారు. ఐదేళ్లుగా ఒకే స్థానంలో కొనసాగుతున్న వారికి తొలుత స్థాన చలనం ఉండనున్నది. ప్రధానంగా అవినీతి ఆరోపణలు, వివాదాస్పద అధికారులు, ఐదేళ్లు పైబడి ఒకే స్థానంలో ఉన్న వారిని కచ్చితంగా ఇతర చోట్లకు మార్చనున్నారు. కొన్ని డివిజన్లలో ప్రజాప్రతినిధుల అండతో ఇంజినీర్లు (డీజీఎం, జీఎం) స్థాయిలో ఏండ్ల తరబడి కొనసాగుతున్నారు. అయితే అటు బదిలీల జాబితా సిద్ధమవుతుందో లేదో అప్పుడే కొందరు పైరవీలకు తెర లేపినట్లు చర్చ జరుగుతున్నది. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో ఉన్న డివిజన్‌లో ఉన్న జీఎం, డీజీఎంలు పైరవీలతో యథావిధిగా కొనసాగేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మెయింటెనెన్స్ విభాగంలో ఉండే కొందరు ఇంజినీర్లు ప్రాజెక్టు విభాగంలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది. మొత్తంగా బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందా? లేదంటే పైరవీల జాతర నడుస్తుందో వేచి చూడాల్సిందే.

# ఆడ బిడ్డ అనే పడేశారా?

### ఏ కన్న తల్లి బిడ్డో.. చెత్త కుప్పలో ఆడ శిశువు మృతదేహం

పెద్దఅంబర్‌పేట, జూన్ 11 : కండ్లు తెరిచి లోకాన్ని చూడనేలేదు.. కెవ్వుమంటూ అమ్మ ఒడిలో ఏడ్చిందో లేదో కూడా ఎవరికీ తెలియదు.. నవ మాసాలు మోసిన తల్లి కూడా మనసారా బిడ్డకు పాలు పట్టిందనేదీ ఎవరూ ఎరుగరు.. కానీ, అప్పుడే ఓ చెత్త కుప్పలో శవమై కనిపించింది ఆడ బిడ్డ? అయ్యో ఏ కన్న తల్లి బిడ్డో అంటూ కొందరు, ఆ తల్లికి కనికరమే లేదా అని ఇంకొందరు నిట్టూరుస్తూ ఆవేదన వ్యక్తం చేసేలా చేసింది. ఓ ఆడ శిశువు మృతదేహం చెత్త కుప్పలో కనిపించిన ఈ ఘటన మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం సమీపంలో ఆదివాసీ కాలనీలో మంగళవారం చోటుచేసుకున్నది. కాలనీలో చివరన ఖాళీగా ఉన్న ఓ ప్లాట్‌లో పెరిగిన ముళ్ల పొదలు, చెత్తాచెదారాల మధ్య ఓ ఆడ శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. చుట్టూ ఇండ్లు ఉన్నా, జనం తిరుగుతూనే ఉన్నా.. అక్కడ ఆడ బిడ్డ మృతదేహాన్ని ఎవరు వేశారనేది ఎవరూ గుర్తించలేదు.

కొద్దిగా దుర్వాసన వస్తుండటంతో చుట్టు పక్కల వారి చూపు ఆ ఖాళీ ప్లాట్‌పైకి వెళ్లింది. తీక్షణంగా గమనించిన స్థానికులు అందులో శిశువు మృతదేహం ఉన్నట్టు గుర్తించారు. వెంటనే కాలనీ ప్రెసిడెంట్ రమావత్ మట్టయ్య ఫిర్యాదుతో నాగోల్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. నెలలు నిండని ఆడ శిశువును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పడేసినట్టు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆడ బిడ్డ అని తెలిశాకే శిశువును వదిలేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లేదా మరేదైనా కారణం ఉన్నదా.. శిశువు తల పగిలి ఉన్నది. శిశువును విసిరేసినప్పుడు అలా జరిగిందా అనేది కూడా దర్యాప్తులో తేలనున్నది.


నమస్తే తెలంగాణ

వికారాబాద్

హైదరాబాద్, బుధవారం 12 జూన్ 2024 | VIKARABAD


# వర్షాకాల ప్రణాళికపై నేడు సమీక్ష



సిటీబ్యూరో, జూన్ 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షాకాలానికి సంబంధించి ఆయా ప్రభుత్వ శాఖలు తీసుకుంటున్న ఏర్పాట్లపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరగనున్న సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యుత్, పోలీస్ శాఖ అధికారులు పాల్గొంటారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో జరుగుతున్న నాలా అభివృద్ధి (ఎస్‌ఆర్‌డీపీ) పనులు, ఎస్‌ఎన్‌డీపీ పనులతో పాటు శిథిల భవనాలపై స్పెషల్ డ్రైవ్, నాలా పూడికతీత పనులు, వర్షాకాల ప్రణాళికల అమలుపై జీహెచ్‌ఎంసీ అధికారులతో మంత్రి చర్చించనున్నారు. లోతట్టు ప్రాంతాలు, చెరువుల సమీపంలో ఉండే వారిని అప్రమత్తం చేసే చర్యలపై చర్చించి నిర్ణయాలు వెల్లడించనున్నారు.



రంగారెడ్డి జడ్పీ సమావేశంలో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, సీఈవో కృష్ణారెడ్డి

# ప్రతిపాదనలు సరే.. పనులెప్పుడు?

- ఆరు నెలలుగా ఒక్క పనికీ ప్రొసీడింగ్ ఇచ్చిన పాపాన పోలేదు
- రంగారెడ్డి జిల్లా సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన
- విద్య, వైద్య శాఖల పనితీరుపై అసంతృప్తి
- విద్యుత్ అధికారుల తీరును నిరసిస్తూ చైర్మన్ పోడియం ముందు కూర్చుని నిరసన తెలిపిన కడ్తాల్ జడ్పీటీసీ
- రంగారెడ్డి జిల్లాలో విద్య, వైద్యశాఖల్లో ఇంటర్నల్ డిప్యుటేషన్లు వద్దని సభ ఏకగ్రీవ తీర్మానం
- జడ్పీ చైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం
- పాల్గొన్న కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

రంగారెడ్డి, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్తు చివరి సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. గడిచిన ఆరు నెలల కాలంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఒక్క ప్రొసీడింగ్ కూడా ఇచ్చిన పాపాన పోలేదని సభ్యులు ఆక్రోశం వెళ్లగక్కారు. విద్య వైద్యారోగ్య శాఖల పనితీరు బాగాలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారుల తీరును నిరసిస్తూ కడ్తాల్ జడ్పీటీసీ సభ్యుడు ఏకంగా చైర్మన్ పోడియం ముందు కూర్చుని నిరసన తెలిపారు. మంగళవారం జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రజాపరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, సీఈవో కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈవో రంగారావు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోతున్నాం..

అభివృద్ధి పనుల విషయంలో ప్రజలకు మాట ఇచ్చాం. మీరేమో ఒక్క ప్రొసీడింగ్ ఇవ్వకపోతిరి. ఇట్లయితే ప్రజలకు ఇచ్చిన మాటను ఎలా నిలబెట్టుకుంటామని సభ్యులు సర్వసభ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తొలుత ఇబ్రహీంపట్నం జడ్పీటీసీ మహిపాల్ సమావేశంలో మాట్లాడారు. ఆయనకు మిగతా సభ్యులు అంతా మద్దతు పలికారు. ఇంకా తమ పదవీ కాలం ఇరవై రోజులే ఉన్నదని, అప్పటిలోగా ప్రొసీడింగ్స్ ఇస్తేనే ప్రయోజనం ఉంటుందని సభ్యులు కోరారు. ఇందుకు జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి బదులిస్తూ.. ఈ నెల 6 వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రొసీడింగ్స్ జారీలో ఆలస్యమైందని పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ జారీకి కొంత సమయం పడుతుందని, జనరల్ ఫండ్‌కు సంబంధించినవి వారం రోజుల్లో ఇస్తామని చెప్పారు. అయితే మూడు, నాలుగు రోజుల్లో ఇచ్చేలా చూడాలని జడ్పీచైర్‌పర్సన్ కోరారు.

### ప్రభుత్వ వైద్యుల ప్రైవేటు ప్రాక్టీస్..

ప్రభుత్వ దవాఖానలకు సంబంధించిన వైద్యులకు సొంతంగా ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు ఉండడం వల్ల విధులకు డుమ్మా కొడుతున్నారని పలువురు సభ్యులు సమావేశంలో ఆరోపించారు. కేశంపేట, శంషాబాద్, నందిగామ ప్రాంతాల్లో కొంతమంది డాక్టర్లు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారని, ప్రైవేటు ప్రాక్టీస్ వల్ల విధులకు సైతం సరిగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ దవాఖానలలో పాము కాటుకు మందులు సైతం అందుబాటులో లేకపోతే ఎలా? అని తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సమావేశం దృష్టికి తెచ్చారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు, వైద్య సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆపరేషన్ థియేటర్లలో ఏసీలు, ఇతర వసతులు, సదుపాయాలు ఉండేలా చూడాలని కోరారు. ఉన్నతాధికారులు ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్ అధికారులను కోరారు. విద్యా, వైద్య శాఖల్లో ఇంటర్నల్ డిప్యుటేషన్ల రద్దుకై సభ ఏకగ్రీవంగా తీర్మానిస్తున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి చెప్పగా.. కలెక్టర్ స్పందిస్తూ.. డిప్యూటేషన్లు శాఖాపరమైన నిర్ణయమని, రాష్ట్ర స్థాయిలో కూడా దీనిపై ఓ నిర్ణయం తీసుకునేలా సభ్యులు చొరవ చూపాలని సూచించారు.

ప్రతి ఆరోగ్య కేంద్రంలోనూ కచ్చితంగా డాక్టర్లు, సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని, వైద్యశాఖపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు.

### ప్రైవేటు స్కూళ్లల్లో అడ్డగోలుగా ఫీజు వసూలు..

ప్రైవేటు స్కూళ్లు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని సభ్యులు సమావేశంలో ఆరోపించారు. యూనిఫామ్స్ కొనాలని ఒత్తిడి తేవడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. చేవెళ్ల మండలం గౌరాయపల్లిలో ప్రభుత్వ పాఠశాలను గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్నారని, కొన్నిసార్లు చెట్ల కింద కూర్చోబెట్టి విద్యా బోధన చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అక్కడి ఎంపీపీ అధికారుల దృష్టికి తెచ్చారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఈవో సుశీందర్‌రావుకు సూచించారు. యాచారంలోని ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం నిర్వాకం వల్ల ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమవుతున్నదని, ఆ పాఠశాలకు అనుమతులు ఇవ్వవద్దని ఎంపీపీ కోరగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని డీఈవో హామీ ఇచ్చారు. పాఠశాలల కొరత ఉన్నచోట్ల పారా టీచర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. పాఠశాలలు తెరిచే నాటికి పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ అందుబాటులో ఉంచాలన్నారు.

### పోడియం ముందు నిరసన..

కడ్తాల్ మండలంలో నూతనంగా నిర్మించిన కస్తూర్బా పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కడ్తాల్ జడ్పీటీసీ దశరథ్ నాయక్ చైర్‌పర్సన్ పోడియం ముందు కింద కూర్చొని నిరసన తెలిపారు. రూ.6 లక్షలు డీడీ కట్టినప్పటికీ తాత్సారం చేస్తున్నారని, అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. గాలివానలకు విద్యుత్ అంతరాయం జరుగుతున్నప్పటికీ ఏఈలు, లైన్‌మన్లు స్పందించడం లేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు.

### సమావేశంలో ప్రస్తావించిన మరిన్ని సమస్యలు..

- ప్రస్తుతం తాగునీటి కొరత లేదని, వాల్స్, కంట్రోల్ వాల్స్ లేక, నిర్వహణ సరిగా లేని కారణంగా తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని షాద్‌నగర్ వీర్లపల్లి శంకర్ మిషన్ భగీరథ అధికారులను ఉద్దేశించి అన్నారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.
- నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతులకు ఇబ్బందులు కలుగకుండా వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని సభ్యులు కోరగా.. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి గీతారెడ్డి స్పందిస్తూ.. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులందరం కలిసి తనిఖీలు నిర్వహించి పర్యవేక్షించడం జరుగుతున్నదని తెలిపారు.
- గడిచిన ఐదేండ్లలో సుదీర్ఘ సమీక్షలను నిర్వహించడం జరిగిందని, ప్రజా సమస్యలను ప్రస్తావించి తీర్మానాలు చేశామని జడ్పీ చైర్‌పర్సన్ అనితా హరినాథ్‌రెడ్డి సమావేశంలో మాట్లాడుతూ పేర్కొన్నారు. జిల్లాలో ఎంపీడీవోలు, నోడల్ అధికారులతో సమస్యలపై చర్చించి పరిష్కారం చూపడం జరిగిందన్నారు. ఐదేండ్లుగా సహకరించిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.
- ఇటీవల కన్నుమూసిన రామోజీరావు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావుకు సమావేశం సంతాపం తెలిపింది. సభ్యులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.





అధికారులకు సమస్యలను తెలుపుతున్న జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ సమావేశంలో పాల్గొన్న షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్



# పోదాం పద బడికి..



### నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- ప్రభుత్వ పాఠశాలలను వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు, యూనిఫాం
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో వసతుల కల్పన



బొంరాస్‌పేట, జూన్ 11 : నేటి నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నది. వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బుధవారం నుంచి తెరుచుకోనున్నాయి. సర్కారు బడుల్లో విద్యార్థులను చేర్పించడానికి విద్యా శాఖ ఈ నెల 6వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతి, సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు మహిళా సంఘాలతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. వీటిద్వారానే పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, చిన్న చిన్న మరమ్మతుల వంటి పనులు పూర్తి చేసి వసతి సౌకర్యాలను కల్పిస్తున్నది. ఇవన్నీ బాగానే ఉన్నా సర్కారు బడుల్లో విద్యార్థులను ఉపాధ్యాయుల కొరత వేధిస్తున్నది. జిల్లాలో 1038 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలా పాఠశాలల్లో సింగిల్ టీచర్లు పని చేస్తున్నారు. వీరు ఏ కారణం చేతనైనా సెలవు పెడితే ఆ పాఠశాల మూతపడాల్సిందే. ఖాళీ పోస్టుల స్థానంలో విద్యా వలంటీర్లను నియమించే పరిస్థితి లేకపోవడంతో టీచర్ల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే పరిస్థితి లేదు. అదేవిధంగా ఫిజికల్ సైన్స్ టీచర్లు 6, 7 తరగతులకు గణితం బోధించాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను చాలా మంది ఫిజికల్ సైన్స్ టీచర్లు వ్యతిరేకిస్తున్నారు. గణితం బోధించడానికి వారు నిరాకరిస్తున్నారు. ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించినా దానికి కనీసం ఐదారు నెలలు పడుతుంది. అప్పటి వరకు సగం విద్యా సంవత్సరం ముగుస్తుంది. పాఠశాలల్లో టీచర్ల కొరత ఉండడం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు బాట పట్టిస్తున్నారు. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే పూర్తి చేయాల్సిన టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఇప్పుడు చేపట్టడం వల్ల పాఠశాలల నిర్వహణ గందరగోళంగా మారే అవకాశం ఉన్నది.

### ముందే యూనిఫాం, పాఠ్య పుస్తకాలు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందజేసే పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం మండలాలకు ముందే చేరుకున్నాయి. ఎంఆర్‌సీ కేంద్రాల నుంచి పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. విద్యార్థులకు అందజేసే రెండు జతల యూనిఫాంను కుట్టే బాధ్యతను ప్రభుత్వం ఈ ఏడాది మహిళా సంఘాలకు అప్పగించింది. ఒక జతకు సరిపోయే వస్త్రం రావడంతో దానిని ఎంపిక చేసిన మహిళా సంఘాలకు ఇవ్వగా వారు యూనిఫాంను కుట్టి పాఠశాలలకు అందజేస్తున్నారు. పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు వీటిని అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

### పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు..

ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది నుంచి మహిళా సంఘాలతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసి ఈ కమిటీల ద్వారానే పనులు చేయిస్తున్నది. తాగునీరు, విద్యుత్‌తో పాటు మరమ్మతు పనులకు ప్రాధాన్యం ఇచ్చి పనులు చేయిస్తున్నారు. ఈ పనులు కొన్ని పాఠశాలల్లో పూర్తి కాగా, మరికొన్ని పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. పాఠశాలలకు రంగులు వేస్తున్నారు. విద్యార్థులు కూర్చోవడానికి డ్యూయెల్ డెస్క్ బెంచీలు, గ్రీన్ చాక్ బోర్డులు ప్రభుత్వం సరఫరా చేసింది.

# అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అసంపూర్తిగా పనులు

- ప్రభుత్వ పాఠశాలలపై విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యం

మొయినాబాద్, జూన్11: నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి కొన్ని పాఠశాలలను ఎంపిక చేసింది. అందులో భాగంగా మొయినాబాద్ మండలంలో 19 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఎంపికైన ప్రతి పాఠశాలకూ రూ.లక్ష నిధులను మంజూరు చేసింది. తదనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలుగా పేరును మార్పు చేసింది. పాఠశాలల భవనాలు, మరుగు దొడ్ల మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, ఫ్యాన్‌లు, లైట్లు వంటి పనులను పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కానీ ఇప్పటి వరకు పనులు మాత్రం పూర్తి కాలేదు. నత్త నడకన సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరం.



మొయినాబాద్‌లోని రెడ్డిపల్లిలో డోర్‌లు లేకుండా ఉన్న మరుగుదొడ్లు

### ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలలు..

మొయినాబాద్ మండలంలో 19 పాఠశాలలు ఎంపికయ్యాయి. అందులో రెడ్డిపల్లి, చందానగర్ ఎన్కేపల్లి, అమ్డాపూర్, కేతిరెడ్డిపల్లి గ్రామాల్లో జిల్లా పరిషత్ పాఠశాలలు, నాగిరెడ్డిగూడ, ముర్తుజాగూడ, శ్రీరాంనగర్ గ్రామాల్లో ప్రాథమికోన్నత పాఠశాలలు, కుతుబుద్దీన్‌గూడ, ఎల్కగూడ, సురంగల్, చాకలిగూడ, చిన్నషాపూర్, సజ్జన్‌పల్లి, నక్కలపల్లి, అప్పారెడ్డిగూడ, మోత్కుపల్లి, అప్పోజిగూడ, ఎతుబార్‌పల్లి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఎంపికయ్యాయి. మౌలిక వసతుల కోసం ప్రతి పాఠశాలకూ రూ.లక్ష మంజూరు చేసింది. పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కలెక్టర్ శశాంక గత నెల 31వ తేదీన పాఠశాలలను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కానీ పనులు మాత్రం ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.